సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



చేసిందే చెబుదాం

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన ఘనత మనకే దక్కుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



హామీల అమలులో విఫలం

హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. 8లో▸

నేడు చౌమహల్లా ప్యాలెస్‌లో సీపీ ఇఫ్తార్ విందు

చార్మినార్: నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పాతబస్తీ ఖిల్వత్‌లోని చౌమహల్లా ప్యాలెస్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించనున్నట్లు ఆదివారం దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ముఖ్య అతిథిగా సీవీ ఆనంద్‌తో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

టస్మో జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్



నియామకపత్రం అందుకుంటున్న రాజశేఖర్

ఇబ్రహీంపట్నం రూరల్: టైగర్ ఆల్ స్టయిల్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ (టస్మో) ఇండియా జిల్లా అధ్యక్షుడిగా చింతపల్లిగూడ గ్రామానికి చెందిన జోగు రాజశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం నగరంలో రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జోగు రాజశేఖర్ మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ హక్కుల సాధనకు కృషి చేస్తానని అన్నారు. జిల్లాలో ఉన్న అన్ని సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘటితం చేస్తామ న్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా కిడ్నీ వాక్



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

రాయదుర్గం: కిడ్నీ వాకథాన్‌తో పాటు రన్‌లో ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కిడ్నీ సంరక్షణ కోసం 5 కిలోమీటర్ల వాకథాన్, రన్‌ను ఆదివారం ఉదయం నిర్వహించారు. వాకథాన్, రన్‌లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్వైవర్స్‌తో పాటు వెయ్యి మంది ఉల్లాసంగా పాల్గొనడం విశేషం. చిన్నారులతో పాటు శతాధిక వృద్ధుడు అప్పసాని శేషగిరిరావు కూడా ఉల్లాసంగా వాకథాన్‌లో పాల్గొనడం మరో విశేషం. కార్యక్రమంలో స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి, రిటైర్డ్ డీసీపీ భద్రీనాథ్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, ఈశ్వరగిరి, డాక్టర్ గండె శ్రీధర్, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.



శతాధిక వృద్ధుడు శేషగిరిరావు

యోగాతో పార్కిన్సన్ వ్యాధిగ్రస్తుల్లో మంచి ఫలితాలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బంజారాహిల్స్: పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వారికి సాధారణ వైద్యంతో పాటు యోగా, స్పీచ్ థెరపీలతో మంచి ఫలితాలు వస్తున్నాయని డాక్టర్ రుక్మిణి అన్నారు. ప్రపంచ పార్కిన్సన్ డే సందర్భంగా ఆదివారం పార్కిన్సన్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్, సిటీ న్యూరో సెంటర్ సంయుక్తంగా బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని సిటీ న్యూరో ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రతి వెయ్యి మందిలో ఒకరికి పార్కిన్సన్ వ్యాధి తీవ్రమవుతోందని.. వీరికి సరైన వైద్యం అందిస్తే నయమవుతుందని స్పష్టం చేశారు. యోగా, స్పీచ్ థెరపీలతోనూ మంచి ప్రయోజనాలు ఉంటున్నాయని తెలిపారు. పార్కిన్సన్ వ్యాధికి గురైన వారు ఒంటరిగా ఉండటం వల్ల మానసికస్థితి దెబ్బ తింటోందని, వీరి కోసం పార్కిన్సన్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ సంస్థ తోడుగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ఉచితంగా యోగా, స్పీచ్ థెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, రూపం బోర్గేయిన్, సాయి దీపక్, శశి, సందీప్, ప్రసాద్, యోగా మాస్టర్ రమేష్, శ్రీదేవి పాల్గొన్నారు.

‘మార్గం’ సుగమం!

- శరవేగంగా ఎయిర్ పోర్ట్ కార్గో రోడ్డు
- మామిడిపల్లి నుంచి అనుసంధానం
- త్వరలో అందుబాటులోకి..
- ట్రాఫిక్ సమస్యలకు చెక్
- సాఫీగా సాగనున్న ప్రయాణం



శంషాబాద్ విమానాశ్రయ మార్గంలో నిర్మాణ దశలో ఉన్న కార్గో రోడ్డు

పహాడీషరీఫ్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మామిడిపల్లి మీదుగా కొత్త కార్గో రోడ్డు త్వరలో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే దుర్గానగర్ చౌరస్తా (ఒరంగడ్డ) నుంచి మామిడిపల్లి వరకు ఉన్న ఈ కార్గో రోడ్డును తాజాగా విమానాశ్రయం వరకు పొడిగిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. మామిడిపల్లి సమీపంలోని వివేకానంద చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వెలుపల మీదుగా విమానాశ్రయం వరకు చేరుకోనుంది.

16 ఏళ్ల అనంతరం..

విమానాశ్రయానికి గూడ్స్ సామగ్రితో వెళ్లే భారీ వాహనాలు, సాధారణ ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలు లేకుండా సులభంగా చేరుకోవాలన్న ఉద్దేశంతో 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈపీ -7 కార్గో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 150 ఫీట్ల విస్తీర్ణంలో ఒరంగడ్డ నుంచి ప్రారంభమైన ఈ రహదారి పనులు లక్ష్మీగూడ, వాంబే కాలనీ, శ్రీరాం కాలనీ, జల్‌పల్లి మీదుగా మామిడిపల్లి వివేకానంద చౌరస్తా వరకు ఆరు కిలోమీటర్ల మేర అప్పట్లోనే పూర్తయ్యాయి. విమానాశ్రయానికి అనుసంధానం చేయని కారణంగా ఇన్నాళ్లు తుక్కుగూడ, శంషాబాద్ రూట్‌లోనే కార్గో వాహనాలు వెళ్తూ వచ్చాయి. లక్ష్మీగూడ, జల్‌పల్లి ముత్యాలమ్మ ఆలయం వెనుక భాగంలో కోర్టు కేసుల కారణంగా నిలిచిన పనులు కూడా మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. ఎట్టకేలకు కార్గో రోడ్డు పూర్తి కానుండడంతో నిర్మాణ లక్ష్యం నెరవేరనుంది.

మూడు కిలోమీటర్ల మేర కొత్త రోడ్డు

మామిడిపల్లి వరకు ఉన్న కార్గో రోడ్డుకు అనుసంధానంగా ప్రస్తుతం మూడు కిలోమీటర్ల పొడవున నూతన రహదారి నిర్మాణం జరగనుంది. వివేకానంద చౌరస్తా నుంచి శంషాబాద్‌కు వెళ్లే దారిలో దాదాపు 750 మీటర్ల పొడవులో 90 ఫీట్ల వెడల్పుతో రోడ్డును విస్తరించనున్నారు. అక్కడ టర్న్ అయ్యి నాగలక్ష్మమ్మ కంచె నుంచి 2.5 కిలోమీటర్ల మేర 150 ఫీట్ల విస్తీర్ణంలో కొత్త రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులో రెండు భారీ జంక్షన్లను సైతం నిర్మిస్తున్నారు.

వాణిజ్య కేంద్రంగా మామిడిపల్లి

విమానాశ్రయ నిర్మాణం కోసం మొత్తం ఐదు వేల ఎకరాల భూ సమీకరణ జరగ్గా.. అందులో ఒక్క మామిడిపల్లికి చెందిన రైతులే రెండు వేల ఎకరాల భూములు ఇచ్చారు. అలాంటి ఈ గ్రామ ప్రజలకు విమానాశ్రయం కారణంగా రోజురోజుకూ ఉపాధి అవకాశాలు మెరుగు పడుతున్నాయి. ఇప్పటికే విమానాశ్రయంతో పాటు గ్రామాన్ని ఆనుకొని ఉన్న అమెజాన్ కంపెనీలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు చేస్తున్నారు. ఇక మామిడిపల్లి కొండల్లో ఏర్పాటవుతున్న ఐటీ కంపెనీలతో పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు రానున్నాయి. తాజాగా కార్గో రోడ్డు అనుసంధానంతో వివేకానంద చౌరస్తా నుంచి శంషాబాద్ రోడ్డులో పెద్ద ఎత్తున హోటళ్లు, ఇతర నిర్మాణాలతో వాణిజ్య కేంద్రంగా మారనుంది. గ్రామ శివారులో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తూ హైలెవల్ రెసిడెన్షియల్ జోన్‌గా మార్చేస్తున్నాయి.



విశాలంగా ఏర్పాటవుతున్న జంక్షన్

వెసులుబాటు



ఈ రోడ్డు నిర్మాణంతో విమానాశ్రయానికి వెళ్లే వాహనదారులకు వెసులుబాటు కానుంది. గ్రామాన్ని ఆనుకొని ఏర్పాటైన అమెజాన్ కంపెనీలో ఏ వస్తువు ఆర్డర్ ఇచ్చినా మా గ్రామ చిరునామాతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు డెలివరీ అవుతుండడం సంతోషకరం. ఒకవైపు ఐటీ కంపెనీల ఏర్పాటు, మరోవైపు పెద్ద ఎత్తున కొనసాగుతున్న విల్లాల నిర్మాణంతో గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. రెండు మూడేళ్లలో మామిడిపల్లి ఐటీ హబ్‌గా మారనుంది.

– శివకుమార్, కార్పొరేటర్, మామిడిపల్లి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

గడపగడపకూ ప్రభుత్వ పథకాలు

- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నందిగామ: ప్రభుత్వ పథకాలు గడపగడపకూ చేరుతున్నాయని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎప్పుడూలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారని, ఇక్కడి అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ పాలన కోరుతున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అదాని, అంబానీల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణలో ప్రవేశ పెట్టిన పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ప్రవేశపెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వేలను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో వలసవాదుల బతుకులు మారాయన్నారు. రాబోయే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్టీకోసం పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం కూడా ప్రవేశ పెట్టలేదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా నందిగామ, తాళ్లగూడ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు గులాబీ కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీలు ప్రియాంక గౌడ్, రవీందర్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు వెంకట్‌రెడ్డి, గోవింద్ అశోక్, జెట్ట కుమార్, రాజునాయక్, జేకే నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, మంజుల, రాజ్ గోపాల్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, నాయకులు నారాయణరెడ్డి, విఠల్, గోవు రవికుమార్, తోట భాస్కర్, పాండు, మల్లేశ్, శ్రీశైలం, జంగిలి కుమార్ పాల్గొన్నారు.

12న సైబర్ భద్రతపై సమ్మిట్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ పోలీసు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 12న బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో సైబర్ నేరాలు, భద్రతలపై సమ్మిట్ జరగనుంది. కార్యక్రమానికి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, హోంమంత్రి మహమూద్ అలీ, రిటైర్డ్ ఐపీఎస్ సంజయ్ సాహా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల తదితరులు హాజరవుతారని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌సీఎస్‌సీ చైర్మన్, సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. వ్యక్తులు, వ్యవస్థలు ఐక్యంగా పని చేస్తే సైబర్ నేరాలను నియంత్రించొచ్చని పేర్కొన్నారు. హెచ్‌సీఎస్‌సీ జాయింట్ సెక్రటరీ సంతోష్ కావేటీ మాట్లాడుతూ.. ప్రతి నెలా సైబర్ బిజినెస్ కనెక్ట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. లఘు చిత్రాల ద్వారా సైబర్ నేరాలు, భద్రతలపై అవగాహన కల్పిస్తామన్నారు.



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో సభ్యులు

రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌గుప్తా

ఆమనగల్లు: రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొద్దుటూరి రవీందర్‌గుప్తా కోరారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటనర్సింహా గార్డెన్స్‌లో ఆదివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఆమనగల్లు డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మిట్టపల్లి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా మంచుకొండ విష్ణువర్ధన్, కోశాధికారిగా జ్ఞానేశ్వర్, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గుప్తా మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్‌మిల్లులు సరిగా నడవకపోవడంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. రైస్‌మిల్లర్ల నిర్వహణ భారంగా మారిందని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రైస్ మిల్లులకు లెవీధాన్యం సేకరించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామనాథం గుప్తా, కోశాధికారి నరేశ్‌ఘోయల్, ఉపాధ్యక్షుడు ఊరె శ్రీనివాస్, సహాయకార్యదర్శి గార్లపాటి గణేశ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జూలురి రమేశ్‌బాబు, స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అదనపు కార్యదర్శి దోనాదుల సత్యానారాయణ, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేస్తే మహేశ్వరం మనదే



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: ఐక్యంగా పోరాడితే మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. నాదర్‌గుల్‌లోని తోట జంగారెడ్డి గార్డెన్‌లో ఆదివారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు బాబు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కలిసికట్టుగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత మాట్లాడుతూ.. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్మేటి అమరేందర్‌రెడ్డి, సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు జంగారెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు ఏం చేశారో చెప్పండి

- రాష్ట్రానికి మోదీ చేసింది శూన్యం
- సంక్షేమ పథకాల ఘనత కేసీఆర్‌దే
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: తెలంగాణకు ప్రధాని మోదీ ఎనిమిదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ప్రశ్నించారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రతీసారి కేసీఆర్ కుటుంబంపై విషం చిమ్మడం తప్ప అభివృద్ధి మాటే లేదన్నారు. విభజన హామీ మేరకు రంగారెడ్డి- పాలమూరు, ఇతర ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇంత వరకు ఇవ్వ లేదని.. లక్షలాది ఎకరాల భూమికి సాగు నీరు అందిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లి గవ్వ ఇవ్వలేదని విమర్శించారు. గతంలో రావిర్యాలకు మంజూరైన ఐటీఐఆర్ ప్రాజెక్టు రద్దు చేసిన ఘనత బీజేపీ నాయకులదేనన్నారు. దేశంలోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ నాయకత్వంలో అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. కార్యకర్తలు సమ్మృష్టిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

హద్దు దాటితే చర్యలు తప్పవు..

బీఆర్ఎస్‌లో ఉంటూ.. పార్టీ ముఖ్యనేతల గురించి వ్యతిరేకంగా మాట్లాడితే, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి హద్దు దాటితే క్రమ శిక్షణ చర్యలు తప్పవని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. ఇష్టం లేనివారు రాజీనామా చేసి బయటికి పోవాలని, పార్టీలో అంకిత భావంతో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అంతకు ముందు ఔటర్ రింగు రోడ్డు నుంచి ఫంక్షన్ హాల్ వరకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జెల్లాల లక్ష్మయ్య యాదవ్, వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, సుమన్, లావణ్య, తేజస్విని, నాయకులు సప్పిడి రాజు, శ్యామేల్ రాజు, వెంకటరాజిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, పద్మ, శ్రీలత పాల్గొన్నారు.

ఫీజు బాదుడే

నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి రాహుల్ కుమారుడు ఓ ప్రైవేటు కార్పొరేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ ట్యూషన్ ఫీజు కింద ప్రతి నెలా రూ. 4,600 చొప్పున చెల్లిస్తూ వస్తున్నాడు. ఏప్రిల్ ఫీజు చెల్లించేందుకు స్కూల్‌కు వెళ్లగా మే నెల ఫీజు కూడా కలిపి చెల్లించాలని సూచించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. స్కూల్ నిర్వహణ, టీచర్ల వేతనాల కోసం ప్రతిసారీ చెల్లించేది కదా అని సమాధానం చెప్పారు. ఇది ఒక రాహుల్ సమస్య మాత్రమే కాదు.. నగరంలోని వేలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్నదే.

- వేసవి సెలవులైనా వెసులుబాటు లేదు
- ఏప్రిల్‌తో పాటు మే నెల కూడా వసూళ్లు
- ఆలస్యమైతే అపరాధ రుసుం
- తప్పని పూర్తి స్థాయి ఫీజుల మోత
- ప్రైవేటు పాఠశాలల వింత పోకడ

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు స్కూల్స్ ఫీజుల అదనపు మోత మాత్రం ఆగడం లేదు. విద్యా సంవత్సరానికి సంబంధించి పన్నెండు నెలలు ఫీజు బలవంతపు వసూళ్లకు తెరలేపారు. ఏకంగా విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్షిప్త సమాచారం పంపించం విస్మయానికి గురిచేస్తోంది. ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల పూర్తి స్థాయి ఫీజుల వసూళ్లపై ఒత్తిడి పెంచాయి. నెలవారీగా ఫీజులు చెల్లించే వారికి ఒకేసారి ఏప్రిల్, మే నెల ఫీజు చెల్లించడం భారంగా తయారైంది. వాస్తవంగా ప్రతి విద్యా సంవత్సరం జూన్12 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 23తో ముగుస్తుంది. నిబంధనల ప్రకారం జూన్ నుంచి మార్చి వరకు మాత్రమే విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయాలి. కానీ.. ప్రైవేటు విద్యా సంస్థలు జూన్, ఏప్రిల్ నెల సైతం పూర్తి స్థాయి ఫీజులు వసూలు చేస్తూ వస్తున్నాయి. తాజాగా మే నెలకు సంబంధించిన ఫీజును కూడా వసూళ్లకు దిగుతున్నాయి. ఏప్రిల్ నెలతో కలిపి మే నెల ఫీజులు కూడా చెల్లించాలని, లేకుంటే హాల్ టికెట్లు జారీ చేయబోమని మౌఖికంగా పేర్కొంటున్నాయి. ప్రైవేటు బడ్జెట్ స్కూల్స్‌తో పాటు కార్పొరేట్, ఇంటర్నేషనల్ విద్యాసంస్థల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. వేసవి సెలవుల కాలానికి కూడా ఫీజులను వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అలస్యమైతే అపరాధ రుసుం

ప్రైవేటు విద్యా సంస్థలు ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ స్కూల్స్ ఒకేసారి లేదా మూడు నెలలకోసారి టర్మ్ ఫీజు తీసుకుంటాయి. కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ మాత్రం ట్యూషన్ ఫీజు కింద ప్రతి నెలా వసూలు చేస్తుంటాయి. ఇక నెలవారీ నిర్దిష్ట గడువులోగా చెల్లించకుంటే అపరాధ రుసుం వసూలు చేయడం సర్వసాధారణమైంది. కొన్నిస్కూల్స్ నెలవారీ అపరాధ రుసుం కనీసం 100 నుంచి రూ.300 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. నిరుపేద కుటుంబాలు ఫీజు చెల్లించడమే కష్టంగా ఉన్న తరుణంలో అపరాధ రుసుం తలకు మించిన భారంగా తయారైంది.

పర్యవేక్షణేది..

సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని విద్యాశాఖలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్) కొరత వెంటాడుతోంది. రెగ్యులర్ కంటే 86 శాతం వరకు హెచ్ఎంలుగా పాఠశాలల్లో పనిచేస్తూ డీఐఓఎస్‌లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలపై సైతం దృష్టి పెట్టాల్సి ఉండగా, పని భారంతో కనీస తనిఖీలు లేకుండా పోయాయి. దీంతో ప్రైవేటు స్కూల్స్ నిర్వహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇది పరిస్థితి..

- హైదరాబాద్ జిల్లా పరిధిలో 1,903 ప్రైవేట్ స్కూళ్లు ఉండగా అందులో 860 కార్పొరేట్ పాఠశాలలు. మిగతావి బడ్జెట్ బడులు. అందులో 7,75,675 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో సుమారు 1462 ప్రైవేటు స్కూల్స్ ఉండగా అందులో 25 శాతం వరకు కార్పొరేట్, ఇంటర్నెషనల్ స్కూల్స్ ఉన్నాయి. అందులో 5,87,634 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.
- రంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారు1408 ప్రైవేటు స్కూల్స్ ఉండగా, అందులో 30 శాతం వరకు కార్పొరేట్, అంతర్జాతీయ స్కూల్స్ ఉన్నాయి. అందులో 6,32,800 మంది చదువుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

హామీల అమల్లో ప్రభుత్వాలు విఫలం



కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి శంకర్

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, మాజీ ఎంపీటీసీ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామానికి చెందిన వివిధ పార్టీల చెందిన 40 మంది, మొండోనిరాయి తండా గ్రామ పంచాయతీకి చెందిన 60 మంది నాయకులు ఆదివారం వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆ రెండు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలతో ప్రజలకు పూర్తిగా విసిగిపోయారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఆ రెండు పార్టీలకు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు రాబోతున్నాయని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నిరంకులపాలన సాగుతుందని అన్నారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కేందుకు సీఎం కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పార్టీలో చేరిన వారిలో మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజురెడ్డి, వీరేష్, కావలి రాజు, నర్సింలు, బాల్‌రాజ్, సునీత, మన్యా నాయక్, బాబు నాయక్, నర్సింలు, మన్య, భిక్షపతి, సోమ్లా, నరేష్, రతన్, దినేష్, శ్రీను, రవి, రమేష్, రెడ్యా, రాములు, దేవిజా, కృష్ణ, రమేష్, రాములు తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు: కుటుంబ పోషణ విషయంలో దంపతుల మధ్య చోటు చేసుకున్న గొడవ కారణంగా భర్త ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కొత్తూరు తండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్ కథనం మేరకు.. తండాకు చెందిన పీ రఘు(32) మున్సిపాలిటీలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్నాడు. తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 8వ తేదీ రాత్రి మద్యం తాగి కుటుంబ పోషణ విషయంలో భార్య స్వరూపతో గొడవ పడ్డాడు. తాగిన మైకంలో రఘు ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎలా ఉన్నావు.. శివకుమార్

- చింతపట్ల వాసికి అరుదైన అవకాశం
- ప్రధాని మోదీతో దగ్గరగా మాట్లాడే అవకాశం



శివకుమార్‌తో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన పున్న శివకుమార్‌కు అరుదైన అవకాశం దక్కింది. ప్రధాని నరేంద్రమోదీ శనివారం హైదరాబాద్ నగర పర్యటన సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు ప్రధాని బీజేపీ రాష్ట్ర కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. చింతపట్ల గ్రామానికి చెందిన పున్న శివకుమార్ కొన్నేళ్లుగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. శివకుమార్‌తో ప్రధాని మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఎన్నాళ్లుగా పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్నావని ఆప్యాయంగా పలకరించారు. ప్రధానితో దగ్గరగా మాట్లాడే అవకాశం రావడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి కలిగిందని శివకుమార్ పేర్కొన్నారు.

ప్రజల్లోకి వెళ్దాం.. చేసిందే చెబుదాం

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

- మంచాలలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన ఘనత మనకే దక్కుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంచాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్‌ఎస్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పని చేశారని పేర్కొన్నారు. గ్రామాల్లో మనం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెబుదామని అన్నారు. అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే వారిని నిలదీద్దామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. నిరంతరం ప్రజల కోసం పని చేయడమే కాకుండా అనేక పరిశ్రమలు తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేశామన్నారు. మరికొన్ని సంవత్సరాల్లో మన నియోజకవర్గం రూపు రేఖలు మారిపోతాయన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఇటీవల రంగాపూర్‌లో చనిపోయిన తెలంగాణ ఉద్యమ కారుడు నైనంపల్లి గణేష్ ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీ రమేష్, పార్టీ రాష్ట్ర నాయకుడు కే మల్లేష్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సీ వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ చంద్రయ్య, ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పైనుంచి పడి కార్మికుడి మృతి

చేవెళ్ల: ఇంటికి రంగులు వేస్తున్న క్రమంలో ఓ కార్మికుడు మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముడిమ్యాల గ్రామానికి చెందిన శేరి దర్శన్ ఇంటికి కొంతమంది కార్మికులు రంగులు వేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన జె.లక్ష్మీపుత్ర(34) తోటి కార్మికుడికి రంగులు అందించే క్రమంలో మొదటి అంతస్తు నుంచి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని మొయినాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మీపుత్ర మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ సంస్కృతి, భాష, యాసపై చిత్రీకరించిన బలగం సినిమాను ఆదివారం రాత్రి కడ్తాల్‌తోపాటు, మక్తమాధారం గ్రామంలో బిగ్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సినిమాను వీక్షించారు. తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ సినిమా ప్రదర్శనకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. - కడ్తాల్

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

తలకొండపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని జాతీయ బీసీ కమిషన మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బంజార జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడని పేర్కొన్నారు. ఇతర కులాల వారికి కూడా ఆదర్శమూర్తిగా నిలిచారని గుర్తుచేశారు. ఆదివారం మండలంలోని పాతకోట తండాలో గిరిజన యూత్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆచారితో పాటు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు, ఎంపీపీ తీర్మణీ నిర్మల, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సేవాలాల్ మహరాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు రాంరెడ్డి, అలివేలు, జీరానాయక్, లక్ష్మీ, గరుసింగ్, అనీల్, పాండు ప్రసాద్, రవిగౌడ్, శ్రీకాంత్, రవీందర్, జుమాని, పత్యానాయక్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సెక్స్ రాకెట్ ముఠా

షాద్‌నగర్ రూరల్: ఇతర రాష్ట్రాల అమ్మాయిలతో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను ఆదివారం షాద్‌నగర్‌లో ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.. విశ్వసనీయ సమాచారం మేరకు.. నాగర్‌కర్నూల్‌కు చెందిన కొందరు షాద్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఇతర రాష్ట్రాల అమ్మాయిలతో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి నలుగురు విటులు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అమ్మాయితో పాటు దందా నిర్వహిస్తున్న మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తిపై కేసు

శంషాబాద్: ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న డ్రంకన్ డ్రైవ్‌కు సహకరించకుండా తిరగబడి బూతులు తిట్టిన వ్యక్తిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి కొత్వాల్‌గూడ సర్వీసు రోడ్డుపై డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తున్న కిరణ్‌చారి అనే వ్యక్తిని పరీక్షించి వీడియో తీస్తుండగా అతను పోలీసులకు దుర్భాషలాడటమేగాక ఫోన్ లాక్కుని కిందపడేశాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకులు

రాజేంద్రనగర్: బైక్‌పై రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టడమేగాక ఇదేమని ప్రశ్నించినందుకు స్నేహితులతో కలిసి కత్తులతో దాడి చేసిన సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..పహాడీ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ ఆలీ(28)తన స్నేహితుడు నదీమ్‌తో కలిసి బైక్‌పై వర్క్ షాప్‌కు వెళ్తుండగా అదే సమయంలో కయూమ్‌నగర్‌కు చెందిన అస్లాం రాంగ్‌రూట్‌లో బైక్‌పై వచ్చి వారిని ఢీ కొట్టాడు. దీంతో ఇమ్రాన్‌తో పాటు నదీమ్ అస్లాంను మందలించి అక్కడి నుంచి పంపించి వేశారు. వారు వర్క్‌సాప్‌లో పని నిమగ్నమై ఉండగా తన స్నేహితులతో కలిసి అక్కడికి వచ్చిన అస్లాం ఇమ్రాన్ ఆలీ, నదీమ్‌లపై కత్తులతో దాడి చేశారు. దీనిపై సమాచారం అందడంతో అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఐ పరీక్ష రాసేందుకు వచ్చి..

ఆకతాయిల దాడిలో గాయపడిన కానిస్టేబుల్

బంజారాహిల్స్: ఎస్‌ఐ పరీక్షల కోసం ఏడాది కాలంగా కష్టపడి చదివాడు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించడంతో మెయిన్స్ పరీక్ష రాసేందుకు నగరానికి వచ్చాడు. మొదటి రోజున పరీక్షలు బాగా రాశానని, రెండో రోజు పరీక్షలు బాగా రాస్తే ఎస్‌ఐ ఉద్యోగం ఖాయమంటూ ఆనందంగా ఉన్నాడు. ఈలోగానే దురదృష్టం వెక్కిరించింది. రోడ్డు మీద వెళ్తుండగా ఓ ఆకతాయి యువకుడితో పాటు అతడి స్నేహితులు దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలపాలై ఎస్‌ఐ పరీక్షలకు దూరమయ్యాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అనిల్‌గౌడ్ ఎస్‌ఐ పరీక్షలు రాసేందుకు రెండురోజుల క్రితం నగరానికి వచ్చాడు. మొదటిరోజైన శనివారం పరీక్షలు రాసిన అనిల్‌గౌడ్ కృష్ణానగర్‌లో ఉంటున్న తన సోదరుడు శ్రీనివాస్ గదికి వచ్చాడు. మరో సోదరుడైన సీఆర్ కానిస్టేబుల్ అనంతం గౌడ్ కూడా అక్కడికి వచ్చారు. ఆదివారం జరగాల్సిన రెండోరోజు పరీక్షలకు ప్రిపేరయిన అనిల్ తన సోదరులతో కలిసి శనివారం రాత్రి రాత్రి 8.30 ప్రాంతంలో క్రరీస్ సెంటర్‌లో క్రరీస్ తెచ్చుకునేందుకు రోడ్డుమీదకు వచ్చాడు. రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న జునైద్ (31) అనేవ్యక్తి తన కారులో ర్యాష్‌గా డ్రైవ్ చేస్తూ వచ్చి అనిల్ తదితరులను తాకుతూ వెళ్లాడు. ట్రాఫిక్‌లో కారును జాగ్రత్తగా చూసి నడపాలంటూ అనిల్ మందలించాడు. దీంతో ఆగ్రహానికి లోనయిన జునైద్‌తో పాటు అతడి స్నేహితుడు తన్వీర్ అహ్మద్ తదితరులు కారులోనుంచి దిగి అనిల్ గౌడ్‌ను, అతడి సోదరుడు అనంతం గౌడ్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మరికొంతమంది స్నేహితులను జుబేర్ ఫోన్‌చేసి పిలిపించి మరోసారి దాడికి దిగారు. దీంతో అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. అడ్డుకునేందుకు యత్నించిన అనంతం గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన అనిల్‌గౌడ్‌ను కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్చి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు బాధితుడి సోదరుడు అనంతం గౌడ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులు జుబేర్, తన్వీర్‌తో పాటు ఇతరులపై ఐపీసీ 279, 325, 341,367 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా తీవ్రంగా గాయపడిన అనిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం జరిగిన ఎస్‌ఐ పరీక్షలకు హాజరు కాలేకపోయాడు. ప్రధాన నిందితులు జుబేర్, తన్వీర్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు ఇతర నిందితుల కోసం గాలింపు చేపట్టారు, సంఘటనా స్థలంలో సీసీ ఫుటేజీలు సేకరిస్తున్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు..

- మండల పరిధిలో 90 శాతం ఆస్తి పన్ను వసూళ్లు
- కొత్త పంచాయతీల్లో 100 శాతం వసూలు
- వసూళ్లలో మెరుగైన ఫలితాలు



నానాజీపూర్ పంచాయతీ కార్యాలయం

శంషాబాద్ రూరల్: ఆస్తి పన్ను వసూళ్లలో మండల పరిధిలోని పంచాయతీలు మెరుగైన ఫలితాలు సాధించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 27 పంచాయతీల్లో 90 శాతం వసూళ్లు కాగా.. ఇంకా రూ.25,28,139 బకాయిలు ఉన్నాయి. పన్ను వసూళ్లల్లో పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపడంతో వసూళ్ల శాతం పెరిగింది. నగదు, ఆన్‌లైన్ ద్వారా రూ.2,17,53,521 పన్ను వసూలు చేశారు.

వంద శాతం వసూళ్లు

మండలంలోని మదన్‌పల్లి పాతతండా, సుల్తాన్‌పల్లి, ఆలీకోల్‌తండా, చిన్నగోల్కొండ, జూకల్, రషీద్‌గూడ, పిల్లోనిగూడ, నానాజీపూర్ పంచాయతీల్లో వంద శాతం వసూళ్లు జరిగాయి. వీటిలో సుల్తాన్‌పల్లి, చిన్నగోల్కొండ, జూకల్, నానాజీపూర్ పంచాయతీలు మినహా మిగిలినవి కొత్త పంచాయతీలే కావడం గమనార్హం. ఇక పెద్దషాపూర్‌తండా, కాచారం, ఘాంసిమియాగూడ, మల్కారం, మదన్‌పల్లి, చౌదరిగూడ, శంకరాపురంలో 90 శాతం పైగా పన్ను వసూళ్లు నమోదయ్యాయి.


అత్యల్పంగా 78 శాతం..

అత్యల్పంగా బహదూర్‌గూడ పంచాయతీల్లో 78 శాతం పన్ను వసూలు చేశారు. తర్వాతి స్థానంలో పెద్దతూప్రాన్, రామంజాపూర్, మదన్‌పల్లి కొత్తతండాలో 83 శాతం వరకు వసూళ్లు జరిగాయి. మేజర్ పంచాయతీలైన పాల్మాకుల, నర్కూడ, పెద్దషాపూర్‌లో 85 నుంచి 89 శాతం వరకు వసూళ్లు నమోదయ్యాయి.

పాత బకాయిలు మోపెడు..

గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లు మంచి ఫలితాలు సాధించగా.. పాత బకాయిలు పేరుకుపోయాయి. రూ.12,90,507 పాత బకాయిలు ఉన్నాయి. నర్కూడలో అత్యధికంగా రూ.3,74,336 బకాయిలు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

ఏళ్లు గడుస్తున్నా అంతే..



ఉప్పర్‌పల్లి ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు

ఉప్పర్‌పల్లిలో డ్రైనేజీ సమస్యతో స్థానికుల అవస్థలు

- ధ్వంసమైన పైప్‌లైన్
- పట్టించుకోని అధికారులు

రాజేంద్రనగర్: పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం ఉప్పర్‌పల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి ప్రధాన రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్‌లను ఆధునికీకరించకపోవడంతో సమస్య నానాటికి తీవ్ర మవుతోంది.

ప్రతిసారీ ఇదే తంతు

గత కొన్నేళ్లుగా ఉప్పర్‌పల్లి చౌరస్తాలో డ్రైనేజీ సమస్య కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా నామమాత్రపు పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు.

కోర్టు ఎదుట డ్రైనేజీ వరద

ఉప్పర్‌పల్లి చౌరస్తాలోని రాజేంద్రనగర్ కోర్టు సమీపంలోనే గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కోర్టుకు ప్రతి రోజు న్యాయవాదులు, ఉన్నతాధికారులు వస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

నూతన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. కొన్నేళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలని వారు కోరుతున్నారు.